క్లుప్తంగా

గుంతలమయంగా రోడ్డు



జెడ్పీ ఎదురుగా గుంతలమయంగా ఉన్న రోడ్డు

కడప సిటీ : కడప నగర పరిధిలోని జిల్లా పరిషత్ కార్యాలయం ఎదురుగా ఉన్న రోడ్డు గుంతలమయంగా మారింది. ఆ ప్రాంతం నుంచి కోటిరెడ్డి సర్కిల్‌కు చేరుకునేందుకు రహదారి ఉంది. ఉన్న కొద్దిమేర రోడ్డులోనే మలుపుల్లో గుంతలు ఎక్కువగా ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని సందర్భాల్లో గుంతలు తప్పించే క్రమంలో ప్రమాదాలు జరిగిన సంఘటనలు లేకపోలేదని స్థానికులు వాపోతున్నారు. జిల్లా పరిషత్ దగ్గరలో ఉన్నప్పటికీ, అధికారులు తరుచూ ఈ రోడ్డులో రాకపోకలు సాగించినప్పటికీ, రోడ్డు బాగు చేయకపోవడంపై ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా ఎన్టీఆర్ జయంతి



ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న టీడీపీ శ్రేణులు

కడప రూరల్ : కడప నగరంలో ఎన్టీఆర్ శత జయంతి కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కేక్ కట్ చేసి అభిమానులు, టీడీపీ కార్యకర్తలకు పంచారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నేతలు మాట్లాడుతూ ఎన్టీఆర్ అటు సినీ ఇటు రాజకీయ రంగాల్లో రాణించారని తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రవీంద్ర, కొండా సుబ్బయ్య, దస్తగిరి, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

ఆజాద్‌నగర్‌లో నాకాబందీ



వాహనాల రికార్డులను పరిశీలిస్తున్న ఎస్ఐ అరుణ్‌రెడ్డి

చింతకొమ్మదిన్నె : మండలంలోని ఆజాద్‌నగర్‌లో ఆదివారం సీకేదిన్నె పోలీసులు నాకాబందీ చేపట్టారు. ఎస్ఐ భూమా అరుణ్‌రెడ్డి ప్రతి ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డులులేని వాహనాలను తనిఖీ చేసి స్టేషన్‌కు తరలించారు. ఎవరైనా కొత్త వ్యక్తులు సంచరిస్తే తమకు సమాచారం అందించాలన్నారు.

అనాథ పిల్లలకు స్కూల్ కిట్‌ల అందజేత



చిన్నారులకు కిట్‌లను అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : నగర పరిధి జేఎస్ఓఎస్‌లోని అనాథ శరణాలయంలో చిన్నారులకు మినీ స్కూల్ కిట్‌లను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా బీఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బీచు నరేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ విద్య దాచుకోవడం కన్నా అందరికీ పంచితే మరింత పెరుగుతుందన్నారు. అన్ని దానాల్లో కంటే జ్ఞాన దానం మిన్న అని అన్నారు. బీఎస్ ఆర్ ఫౌండేషన్ సహకారంతో పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఆశీర్వాదం



కడప కార్పొరేషన్: కడప నగరంలోని ఆదిత్య కల్యాణ మండపంలో ఏపీ నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ ఎస్.యానాదయ్య కుమారుడు శ్రీహరి, లక్ష్మీదేవిల వివాహ రిసెప్షన్ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మేయర్ కె.సురేష్‌బాబు, కమలాపురం, మైదుకూరు ఎమ్మెల్యేలు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, రఘురామిరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు మాసీమ బాబు, అఫ్జల్‌ఖాన్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వీరితోపాటు ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్‌కుమార్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, పలువురు కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

నేడు వైద్య శిబిరం

చాపాడు: ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమంలో భాగంగా సోమవారం కుచ్చుపాప గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి రాజేష్ కుమార్ తెలిపారు.

చల్లని పండు.. పోషకాలు మెండు



నగరంలో విక్రయిస్తున్న కర్బూజ కాయలు



- వేసవి తాపాన్ని తీరుస్తున్న కర్బూజ
- పోషకాలతో ఆరోగ్యం
- కొనుగోలుకు ఆసక్తి చూపుతున్న జనం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కర్బూజ ఆరోగ్యానికి చాలా మంచిది. శరీరంలో వేడిని తగ్గించడంతోపాటు ఎంతో మేలు చేస్తుంది. వేసవి తాపం, దాహాన్ని తీర్చేందుకు అద్భుతమైన ఫలం కర్బూజ. వేసవిలో మన శరీరంలోని నీటి స్థాయి తగ్గిపోతూ ఉంటుంది. తద్వారా డీహైడ్రేషన్, వడదెబ్బకు గురై కళ్లు తిరిగి కిందపడిపోతుంటారు. ఈ పరిస్థితి ఒక్కోసారి ప్రాణాలకే ప్రమాదం. అందుకే మన శరీరంలో వాటర్, షుగర్ లెవల్స్ తగ్గిపోకుండా ఉండేందుకు కర్బూజ తినడం బెస్ట్ ఆప్షన్ అని వైద్యులు చెబుతున్నారు. కర్బూజలో ఉండే విటమిన్లు, పోషకాలు వ్యాధి నిరోధకశక్తిని పెంచే యాంటీ ఆక్సిడెంట్లు, బి.విటమిన్, క్యాల్షియం, సోడియం, మ్యాగ్నిషియం, పొటాషియం, క్లోరిన్, బీటా కెరోటిన్‌లు, విటమిన్-ఏ, విటమిన్-బిఏ, విటమిన్-సి, సుక్రోజ్, ఫ్రక్టోజ్, గ్లూకోజ్, ఎలక్ట్రోలైట్లు ఎండాకాలంలో మన శరీరానికి కావాల్సిన పోషకాలను అందిస్తాయంటున్నారు. రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతల నుంచి శరీరానికి ఉపశమనం కల్పించి ఆరోగ్యం అందిపుచ్చుకునేందుకు చాలా మంది కర్బూజ కాయలను కొనుగోలు చేస్తున్నారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు వీటిని ఇష్టంగా తింటున్నారు. దీంతో కర్బూజ కాయల అమ్మకాలు జోరందుకున్నాయి. ఎక్కడికక్కడ వెలసిన స్టాల్స్, దుకాణాలలో విక్రయాలు సాగుతున్నాయి. రూ. 20 నుంచి 150 వరకు ధర పలుకుతోంది. అక్కడక్కడా కర్బూజ కాయను ముక్కలు చేసి ప్లేట్ రూ.10 నుంచి రూ.20 వరకు అమ్ముతున్నారు. వంద గ్రాముల కర్బూజలో 91.45 గ్రాముల నీరు, ఆరుశాతం చక్కెర, 90 క్యాలరీల శక్తి, 7.6 గ్రాముల పిండి పదార్థాలు, 0.6 శాతం మాంసకృత్తులు ఉంటాయి. వీటితోపాటు 12 గ్రాముల పొటాషియం, ఏడు గ్రాముల క్యాల్షియం, ఒక మిల్లీగ్రాము సోడియం ఉంటాయి.

ప్రయోజనాలు

- వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుంది. మలబద్ధకం రాకుండా చేస్తుంది.
- వృద్ధాప్యంలో అంధత్వం నివారిస్తుంది. రక్తప్రసరణ సక్రమంగా జరుగుతుంది.
- వేసవి తాపం నుంచి ఉపశమనం కలిగిస్తుంది. శక్తినిస్తుంది.

ఆరోగ్యానికి మంచిది



కర్బూజ శరీరానికి ఆరోగ్యాన్ని కలిగిస్తుంది. వయస్సుతో నిమిత్తం లేకుండా అందరూ దీనిని తినవచ్చు. కర్బూజ తీసుకోవడం ద్వారా వేసవి తాపం నుంచి రక్షణ కలిగిస్తుంది. వీలు దొరికినప్పుడల్లా పండ్ల రూపంలో గానీ, జ్యూస్ రూపంలో గానీ తీసుకోవాలి.

– శ్రీకాంత్‌రెడ్డి, వైద్యాధికారి, ఏపీఎస్ ఆర్టీసీ ఏరియా ఆస్పత్రి, కడప

ఔషధాల గని.. నేరేడు

- నగరంలో ఇప్పుడిప్పుడే ప్రారంభమైన అమ్మకాలు
- కిలో రూ.400 పలుకుతున్న వైనం



బండిపై విక్రయిస్తున్న నేరెడు పండ్లు

కడప కోటిరెడ్డిసర్కిల్ : నల్లగా నిగనిగ మెరుస్తూ వగరు, తీపి, పులుపు మేళవింపు రుచులతో ఉండే నేరేడు పండ్ల అమ్మకాలు నగరంలో ప్రారంభమయ్యాయి. మార్కెట్లో కాలానుగుణంగా వచ్చే ఎన్నో పండ్లు రుచితోపాటు ఆరోగ్యాన్నిస్తాయి. అలాంటి వాటిలో అల్లనేరేడు ఒకటి. మే నెల ఆరంభంలో అల్లనేరేడు పంట చేతి కొస్తుంది. ఈ సీజన్‌లో విరివిగా దొరికే ఈ పండ్లను రుచి చూడని వారంటూ ఉండరు. అందుకే మార్కెట్లో కనిపించగానే వీటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతారు. మార్కెట్లో ఇప్పుడు అల్లనేరేడు పండ్లు విరివిగా అమ్ముడవుతున్నాయి. చిత్తూరు జిల్లా మదనపల్లి తదితర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి నేరేడు పండ్లు దిగుమతి చేసుకుంటున్నారు. కొత్తగా మార్కెట్‌లోకి వస్తుండడంతో పండ్ల వ్యాపారులు వీటిని కిలో రూ.400కు అమ్ముతున్నారు.

రాముడు మెచ్చిన పండు

రామాయణంలో శ్రీరాముడు 14 ఏళ్ల వనవాసం చేసినప్పుడు ఎక్కువ భాగం ఈ పండ్లను తిని కాలం గడిపారని పెద్దలు చెబుతారు. అందుకనే భారత దేశంలో గుజరాత్, ఉత్తరప్రదేశ్, బీహార్, మహారాష్ట్ర ప్రాంతాలలో దీనిని దేవతాఫలంగా భావిస్తారు. ఆయుర్వేదంలో ఈ పండును అపర సంజీవని అని పిలుస్తారు. ఈ పండులో విటమిన్ ఏ, సీ పుష్కలంగా ఉంటాయి. నేరేడు పండు మాత్రమే కాక ఆకులు, గింజలు, చెట్టు బెరడు ఔషధ తయారీలో వాడుతారు. ఈ నేరేడు చెట్టు కాయల నుంచి వెనిగర్‌ను తయారు చేస్తారు. జ్ఞాపకశక్తి మెరుగు పరచుకోవాలంటే నేరేడు పండు తినమని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. మధుమేహం, నోటిపూత, చిగుళ్ళ వ్యాధులు, దంతక్షయం, మూత్రంలో మంట తదితర సమస్యల నివారణకు నేరేడు పండ్లు చక్కని ఔషధంగా పని చేస్తాయి.

చందమామతో బాలబంధువుగా పీజీఆర్‌పీ



ఐఎల్ఎన్ చంద్రశేఖర్‌రావును సత్కరిస్తున్న నిర్వాహకులు

కడప కల్చరల్ : చందమామ పత్రికలో వందలాది బాలల కథలు రాసి వారి మనోవికాసానికి టీజీఆర్ ప్రసాద్ ఎంతో కృషి చేశారని ప్రముఖ సాహితీ వేత్త, చరిత్ర ఉపన్యాసకులు డాక్టర్ ఐఎల్ఎన్ చంద్రశేఖర్ రావు అన్నారు. యోగివేమన విశ్వవిద్యాలయం సీపీ బ్రౌన్ భాషాపరిశోధన కేంద్రంలో నిర్వహిస్తున్న నెల నెలా సీమ సాహిత్యంలో భాగంగా ఆదివారం ఆయన టీజీఆర్ ప్రసాద్ జీవితం సాహిత్యం అనే అంశంపై మాట్లాడారు. ఈ సందర్భంగా టీజీఆర్ జీవిత విశేషాలు విద్యాభ్యాసం, ఉద్యోగ ప్రస్థానం గురించి వివరించారు. చందమామ పత్రికలో బేతాల కథలు రాస్తూ ప్రసాద్ పిల్లలకు దగ్గరయ్యారని, 80కి పైగా బేతాల కథలు 600కు పైగా బాలల కథలు 1000 కిపైగా విమర్శన వ్యాసాలు రాశారన్నారు. ఆయన కథలపై పరిశోధనలు కూడా జరిగాయన్నారు. కార్యక్రమం ప్రారంభంలో బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, సహచర పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, గ్రంథపాలకులు హరిభూషణరావు, రమేష్‌రావు, జూనియర్ అసిస్టెంట్‌లు వెంకటరమణ, మౌనిక, పలువురు సాహితీ వేత్తలు ఐఎల్ఎన్ చంద్రశేఖర్‌రావులను ఘనంగా సత్కరించారు.

అభివృద్ధి చేసే వారిని ఆదరించాలి

- ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : అభివృద్ధి చేసే వారిని ఆదరించాలే గాని అసత్య ఆరోపణలు పత్రికల్లో రాస్తే ప్రజలు సహించరని, ఆ పత్రికలను ప్రజలు ఆదరించకపోతే శాశ్వతంగా మూసుకోవాల్సిందేనని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఓ ప్రధాన పత్రికలో వచ్చిన కమలాపురం...ప్రగతికి దూరం అనే కథనానికి స్పందించి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎంత చిత్తశుద్ధితో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నారో... తాను కూడా ఎమ్మెల్యేగా అంతే చిత్తశుద్ధితో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నానన్నారు. కమలాపురంలో మైసూరారెడ్డి, వీరశివారెడ్డి, మహానేత వైఎస్సార్ దయతో ఎంఎల్‌సీ ట్యాగ్ వేసుకున్న వారి హయాంలో ఏ మేరకు అభివృద్ధి చెశారో ప్రజలకు తెలుసన్నారు. విమర్శకుల గురించి తాను పట్టించుకోనని, తాను నియోజకవర్గాన్ని మనస్ఫూర్తిగా అభివృద్ధి చేస్తానన్నారు. అది నా బాధ్యత అని, ప్రజలకు నన్ను ఎమ్మెల్యేగా గెలిపించినందుకు తాను నియోజకవర్గాన్ని అభివృద్ధి చెయాల్సిందేనన్నారు. రూ. 58.2 కోట్లతో మంచి నీటి పథకాన్ని ప్రారంభించామని, మరో ఆరు నెలల్లో అది పూర్తి అవుతుందన్నారు. పైప్‌లైన్‌తో పాటే సీసీ రోడ్లు, రోడ్ల విస్తరణ, బ్యూటిఫికేషన్, లైటింగ్ అన్ని పనులు జరుగుతాయన్నారు. ఇప్పటికే ఆసుపత్రి, పాలిటెక్నిక్ భవనం, సచివాలయాలు, ఆర్‌బీకేలు, వెల్‌నెస్ సెంటర్లు, మార్కెట్ యార్డులో యూపీహెచ్‌సీ, షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించామన్నారు. త్వరలో ఆర్‌ఓబీ, బైపాస్ అన్ని చేస్తామన్నారు. కరోనా లేక పోతే కొప్పర్తికి ఇప్పటికే వందల సంఖ్యలో పరిశ్రమలు వచ్చేవన్నారు. అయినప్పటికి పరిశ్రమలు వస్తున్నాయని, పనులు పూర్తి కావడానికి కొంత సమయం పడుతుందన్నారు. ఏపీలో మహా నగరంగా మార్చడానికి కొప్పర్తిని సీఎం ఎంపిక చేశారంటే కమలాపురం నియోజకవర్గంపై సీఎంకు ఎంత ప్రేమ, అభిమానం ఉందో తెలుస్తుందన్నారు. మహానగరంలో వసతుల కల్పనకు కేంద్ర ప్రభుత్వం ఏడాకి రూ.250 కోట్లు వెచ్చిస్తుందన్నారు. భవిష్యత్తులో కొప్పర్తి మహానగరంగా అవతరించడం ఖాయం అన్నారు. ఒకపుడు ప్రధాన పత్రికగా మంచి క్రెడిబులిటి ఉన్న పత్రిక, యాజయాన్యానికి జగనన్న పాలన చూసి కడుపు మంట ఉందని, వారికి జెలిజిల్ మాత్రలు ఇవ్వాలన్నారు. అసత్య ఆరోపణలు రాస్తున్న ఆ పత్రికను ప్రజలు ఆదరిచడంలేదని, త్వరలో కొన్ని పత్రికలు, ఛానళ్లు మూసుకోవాల్సిందేనని ఆయన అన్నారు. అబద్ధపు వార్తలు కాదని, వాస్తవాలు తెలుసుకుని వార్తలు రాయాలని ఆయన హితవు పలికారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.


ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అంకన్న

కడప ఎడ్యుకేషన్ : కడప, అన్నమయ్య జిల్లాల వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఆకర్షణీయమైన పేర్లతో అక్రమ అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అంకన్న డిమాండ్ చేశారు. కడప పీడీఎస్‌యూ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాల నిబంధనలకు విరుద్ధంగా పెద్దపెద్ద ఫ్లెక్సీలు, ఆకర్షణీయమైన పేర్లను పెట్టి అడ్మిషన్ టెస్టులను నిర్వహిస్తూ సీట్లు భర్తీ చేసుకుంటున్నారని ఆరోపించారు. ఈ విషయంలో సంబంధిత అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా ఇలాంటి పాఠశాలలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు స్వరూప్‌తేజ, శ్రీహరి, వెంకటేష్, రమణ, నాయక్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న వీఆర్ఏల రాష్ట్ర నాయకుడు అంజి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లాలో వీఆర్ఏల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని వీఆర్ఏల సంఘం రాష్ట్ర నాయకుడు కర్నూలు అంజి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో కడప రెవెన్యూ డివిజన్ మండలాల వీఆర్ఏల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్ఏలకు కనీస వేతనం రూ.15 వేలు చెల్లించి ప్రమోషన్లను కల్పించి వారసత్వాన్ని కొనసాగించాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కడప రెవెన్యూ డివిజన్ అధ్యక్షుడిగా రమణ, కార్యదర్శిగా అశోక్, పలువురిని డివిజన్ నాయకులుగా ఎన్నుకున్నారు.

గురువుల రుణం తీర్చుకోలేనిది



వీఎన్‌పల్లెలో గురువులను సన్మానించిన పూర్వపు విద్యార్థులు

వీరపునాయునిపల్లె : గురువుల రుణం తీర్చుకోలేనిదని కడప ఆర్డీఓ దర్మచంద్రారెడ్డి అన్నారు. స్థానిక గడ్డంవారిపల్లె నర్రెడ్డి పెద్ద సంగిరెడ్డి జూనియర్ కళాశాలలో 1982–84వ బ్యాచ్ ఇంటర్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఒక విద్యార్థిగా మరియు ముఖ్య అతిథిగా దర్మచంద్రారెడ్డి హాజరై మాట్లాడారు. 40 సంవత్సరాల క్రితం కలిసి చదువుకున్న విద్యార్థులందరం కలవడం అపూర్వ కలయిక అని ఆయన అన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి, లెక్చరర్లు సుబ్బయ్య, రమణారెడ్డి, గంగిరెడ్డి, కృష్ణారెడ్డి, సంజీవ రెడ్డిలను వారు ఘనంగా సన్మానించారు.

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు



చింతకొమ్మదిన్నె : కొత్తపేట-బుగ్గలేటిపల్లి సరిహద్దుల్లోని గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పట్టు వస్త్రాలతో అమ్మవారిని అలంకరించారు. కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ముద్దలను ఏర్పాటు చేసి ఆభరణాలను, పట్టు వస్త్రాలను కానుకలుగా సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ పార్వతమ్మగారి విశ్వనాథ్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణ అధికారి సురేష్ కుమార్ రెడ్డి ఏర్పాట్లు చేశారు. ఆలయ ఆవరణలో బంధుమిత్రులతో విందుభోజనాలు చేశారు. ఆలయ సమీపంలోని ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అరటి పంట దగ్ధం

కాశినాయన : మండలంలోని సావిశెట్టిపల్లె గ్రామానికి చెందిన కౌలుదారుడు పి.కృష్ణారెడ్డి 5 ఎకరాల్లో అరటిపంట ప్రమాదవశాత్తు కాలిపోయింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు ఉదయం 10 గంటల సమయంలో పొలంలో పనులు చేసుకుంటుండగా మంటలు చెలరేగాయని తెలిపారు. ఎకరాకు రూ.20 వేలు గుత్త చెల్లించి కౌలుకు తీసుకున్నానని, పంట పూర్తిగా కాలిపోవడంతో నష్టం వాటిల్లిందని వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కౌలు రైతు కోరారు.

పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

బద్వేలు అర్బన్ : బద్వేలు డిపో నుంచి వేలాంగిణి, అరుణాచలం పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ డీఎం శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బద్వేలు నుంచి వేలాంగిణికి ప్రతి శుక్రవారం (జూన్ 2,9,16,23,30 తేదీలు) ప్రత్యేక బస్సు ఉంటుందని, శుక్రవారం సాయంత్రం 7 గంటలకు బయలుదేరి శనివారం ఉదయం 10 గంటలకు వేలాంగిణి చేరుకుని మళ్ళీ అక్కడి నుంచి ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరి సోమవారం ఉదయం 5 గంటలకు బద్వేలుకు చేరుకుంటుందని తెలిపారు. బద్వేలు-వేలాంగిణి టిక్కెట్ ధర రూ.2430లు, పోరుమామిళ్ల-వేలాంగిణి రూ.2530లు ఉంటుందని తెలిపారు. అలాగే బద్వేలు నుంచి అరుణాచలంకు పౌర్ణమి సందర్భంగా జూన్ నెల 3వ తేదీన ప్రత్యేక బస్సు ఏర్పాటు చేశామని, ఈ బస్సు 3వ తేదీ సాయంత్రం 7 గంటలకు బయలుదేరుతుందని తెలిపారు.

హాకీ టోర్నీలో విజయం



విజేతగా నిలిచిన కడప డీఎస్ఏ హాకీ జట్టు

కడప స్పోర్ట్స్: చెన్నూరు మండలం కొండపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన 7-ఏ సైడ్ హాకీ టోర్నమెంట్ విజేతగా కడప డీఎస్ఏ జట్టు నిలిచింది. రాయచోటి రాజు హాకీ అకాడమీ జట్టు రన్నరప్‌గా, రాయచోటి జట్టు మూడోస్థానంలో నిలిచారు. విజేతలకు నిర్వాహకులు ట్రోఫీని అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఉమామహేశ్వరి, ఏపీ పీఈటీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కిరణ్, ఫిజికల్ డైరెక్టర్ బి. వెంకటసుబ్బయ్య, హాకీ కోచ్ కల్యాణ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు పెండ్లిమర్రికి ఎమ్మెల్యే రాక

పెండ్లిమర్రి : పెండ్లిమర్రి ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సోమవారం ఉదయం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అల్తాఫ్ హుస్సేన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొంటారని ప్రజాప్రతినిధులు, అధికారులు, వలంటీర్లు హాజరుకావాలని ఆయన కోరారు.

శిల్పారామంలో ఆట-పాట





శిల్పారామంలో చిన్నారుల నృత్య ప్రదర్శనలు

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా స్థానిక మిస్వా మూవీ ఆధ్వర్యంలో చిన్నారులు ఆటపాటలతో ఆకట్టుకున్నారు. స్థానిక ముత్రాసు పల్లె లిటిల్ ట్రీ హౌస్ ప్లేస్కూల్‌కు చెందిన చిన్నారులు ఈ సందర్భంగా పలు ప్రాచుర్యం పొందిన సినీగీతాలు, జానపద పాటలకు హుషారు గొలిపే నృత్యాలు ప్రదర్శించారు. వారు ప్రదర్శించిన కామెడీ స్కిట్లకు ప్రేక్షకులు కరతాళ ధ్వనులతో హర్షం వ్యక్తం చేశారు. శిల్పారామయం పాలనాధికారి శివప్రసాద్‌రెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'అపూర్వ' సమ్మేళనం



పూర్వపు విద్యార్థుల గ్రూప్ ఫొటో

కడప ఎడ్యుకేషన్ : కడపలోని సాయిపేట హైస్కూల్‌లో 1992-93 బ్యాచ్‌కు చెందిన పూర్వపు విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఒకరినొకరు ఎంతో ఆప్యాయంగా పలకరించుకుంటూ ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ మురిసిపోయారు. విద్యార్థి దశలో చేసిన చిలిపి చేష్టలు, కొంటె పనులను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఆనాడు తమకు బోధనలు చేసిన గురువులు రామమూర్తి, నిస్సార్ అహ్మద్, లక్ష్మిరెడ్డి, సుబ్రమణ్యంలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు అశోక్‌కుమార్‌రెడ్డి, బుసం సుబ్బయ్య, చంద్రశేఖర్, జాకట బాలకృష్ణ, కోండద రాముయు, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడ చూసినా మట్టికుప్పలే



ఆదిత్య కల్యాణ మండపం వద్ద కాలువ పక్కన వేసిన మట్టి కుప్పలు



కో ఆపరేటివ్ కాలనీలో సాయిబాబా గుడి సమీపంలో కాలువపై వేసిన చెట్ల కొమ్మలు



పద్మశాలీ కల్యాణ మండపం ఎదురుగా కాలువలోంచి తీసిన పూడిక

కడప కార్పొరేషన్ : కడప నగరంలో చాలా చోట్ల కాలువల్లో ఉన్న పూడికను తీసి రోడ్లపై వేస్తున్నారు. కానీ ఆ మట్టి ఎండిపోయి రోజులు గడుస్తున్నా ఎత్తి వేయడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. మినీ బైపాస్‌లో బ్రహ్మయ్య షెడ్ నుంచి సంజన్న సర్కిల్ వరకూ కాలువలోంచి రాళ్లు, మట్టి తీసి రోడ్డు పక్కన వేశారు. అలాగే సంజన్న సర్కిల్ నుంచి ప్రతాప్ పబ్లిక్ స్కూల్ వరకూ కాలువలోంచి తీసిన పూడిక మట్టిని, రాళ్లను కుప్పలుగా పోశారు.

ఎక్కువ రోజులు దాన్ని అలాగే ఉంచడం వల్ల మళ్లీ ఆ మట్టి, రాళ్లు కాలువలోనే పడిపోయే అవకాశం లేకపోలేదు. అలాగే కో ఆపరేటివ్ కాలనీలో సాయిబాబా గుడి పక్కన చెట్ల కొమ్మలు నరికి కాలువపై వేశారు. మట్టి, మొద్దులు కూడా కాలువపై వేయడం వల్ల అది పూడిపోయే పరిస్థితి ఏర్పడింది.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

కడప కల్చరల్ : కడప నగరం పోలీసు పిరమిడ్ జ్ఞాన కేంద్రంలో 21 రోజుల పాటు విద్యార్థులకు నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. ఈ శిబిరంలో ప్రతిరోజు చిన్నారులకు భగవత్ గీత శ్లోకాలు ధ్యానం గురించి నేర్పారు. వాటి వల్ల లాభాలను వివరించారు.

పలు క్రీడలు ఆడించారు. రూబిక్ క్యూబ్‌లను సరిచేయడం ద్వారా చిన్నారుల సృజనను పెంచారు. అనంతరం చిన్నారులకు ప్రతిభ పత్రాలను అందజేశారు. నేటి మొబైల్ యుగంలో ఇలాంటి శిబిరాల ద్వారా పిల్లలకు ఉపయోగకరమైన అంశాలను నేర్పవచ్చని పిరమిడ్ స్పిరుచువల్ ట్రస్ట్ కార్యదర్శి ఊర్మిళాదేవి అన్నారు. చిన్నారులు శిబిరంలో తమ అనుభవాలను తెలిపారు. ఇతర సెలవు దినాల్లో కూడా ఇలాంటి శిబిరాలను నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు జీవీ శేషారెడ్డి, రమణ, ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.